# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

APRIL-2014

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2014 మార్చి 5వ తేదీ బుధవారం ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామములో చక్కటి సువార్త కూటము జరిగెను. అనేకులు హాజరై దేవుని వాక్యమును ఆసక్తితో ఆలకించిరి. జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై చక్కటి వాక్యపరిచర్య చేసిరి. లింగంపర్తిలో సోదరులు నూతల ప్రసాద్ గారు స్వయంకృషితో చక్కటి ఆలయమును నిర్మించి అగ్రామములో సత్యసువార్త చాటుచున్నారు.

2014 మార్చి 7వ తేదీ శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం కృష్ణాజిల్లా కిలేశపురంలో యున్న క్రీస్తు సంఘము తమ 19వ వార్షికోత్సవమును ఘనముగా జరుపుకొనిరి. సోదరులు డి. యస్. నెల్సన్ గారు అనేక సంవత్సరములుగా అక్కడ వాక్యపరిచర్య చేయుచు స్థానిక సంఘమును బలముగా అభివృద్ధి చేయగలిగిరి. ఆయన ఇబ్రహీంపట్టణంలో నివసిస్తు, పోస్టల్ ఉద్యోగము చేస్తు సువార్త విషయమై గొప్ప ఆసక్తి కలిగిన సహోదరుడు. కిలేశపురంలో జరిగిన స్తుతికూటమునకు సోదరులు యన్.కె.వై. దాసుగారు అధ్యక్షతవహించగా, సోదరులు రాజేంద్రకుమార్ (పరిటాల), పి. అబ్రాహాము (విజయవాడ) గార్లు ప్రార్ధనలలో సహకరించిరి. జాషువా దంపతులు హాజరై వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘము వారిని ఘనముగా సత్కరించిరి. వచ్చినవారందరికీ మంచి విందు నేర్పాటు చేసిరి. సోదరుల నెల్సన్‌గారు క్రీస్తు కొరకు చేయుచున్న పరిచర్య అభినందనీయము.

2014 మార్చి 18,19 తేదీలలో నూజివీడు పాతపేటలో యున్న క్రీస్తు సంఘము సత్యసువార్త సభలు నిర్వహించిరి. " క్రీస్తు శరీరమనగా నేమి ?" అను అంశముపై పలువురు సోదరులు వాక్యోపదేశముగావించిరి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | ఏప్రియల్ - 2014 | సంచిక - 9

## పరలోక ప్రార్థన
### (The Lord's Prayer)

మనుష్యులు విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలెనని యేసు లూకా 18:1లో బోధించెను. యేసు ప్రార్థనలోని శక్తిని తన జీవితములో నిరూపించెను. ప్రార్థనపరులైన ప్రజలు నిజముగా భక్తిపరులై యుందురు. యేసు పాపము లేనివాడు, దేవునికుమారుడు, దేవునితో సమానుడే అయినను ప్రార్థనలో ఎక్కువ సమయమును ఆయన వెచ్చించెను.

యేసు బాప్తిస్మము పొంది ప్రార్థన చేసెను. బహిరంగ సువార్తసేవ చేసిన కొద్ది కాలములోను యేసుప్రార్థనలో ఎక్కువ కాలము గడిపెను. సిలువ నీడలో నిలబడుచు గెత్సెమనె వనములో తన ముఖము మీద చెమట బిందువులు రక్తబిందువులుగా మారునంతమట్టుకు ఆయన ప్రార్థన చేసెను. మనము కూడ అన్నివేళలందును ప్రార్థించవలెను. ప్రార్థన గొప్ప కార్యములు చేయునప్పుడు మాత్రమేకాదు లేదా మనము గొప్ప ఆపదలో యున్నప్పుడు మాత్రమేకాదు గాని మనము ఎడతెగక నిత్యము ప్రార్థన చేయవలెనని యేసు బోధించెను.

కొంతమంది మత్తయి 6వ అధ్యాయములో యున్న "ప్రభువు ప్రార్థనను" పదేపదే వల్లించెదరు. 9-13 వరకున్న వచనములలోని ఆప్రార్థనను తెలుగువారు పరలోక ప్రార్థన అని కూడ పిలుచుచుందురు. అది ఒకమాదిరి ప్రార్థన. దానిని యేసు ఇట్లు నెర్పించెను: "కాబట్టి మీరీలాగు ప్రార్థనచేయుడి. పరలోకమందున్న మాతండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడును గాక; నీ రాజ్యము వచ్చుగాక ! నీచిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక, మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టుని నుండి మమ్మును తప్పించుము".

యేసు ప్రార్థనను గూర్చి బోధించుచు మీరీలాగున ప్రార్థనచేయుడి అని చెప్పిన సంగతిని బట్టి ఆయన నేర్పిన ఈ ప్రార్థన ఒక మాదిరి ప్రార్థన యని గమనించుదాము. అంటే మనము అందులోని పదములను పదేపదే వల్లించవలెనని ఆయన ఉద్దేశముకాదు. అందుకే "మీరు ప్రార్థన చేయునప్పుడు అన్యజనులవలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు" అని ఆయన బోధించెను. యేసు నేర్పిన ఆప్రార్థనలోని మాటలనే వచించుచున్న యెడల అది వ్యర్థమని మనము గ్రహించవలెను. 'మీరీలాగున ప్రార్థనచేయుడి' అని ఆయన చెప్పెను గనుక ఆ ప్రార్థనలోని అంశములు నొక్కొక్కదానిని మనము ఇప్పుడు వివరముగా చూస్తు దీనినుండి మనము నేర్చుకొన దగిన పాఠములను నేర్చుకొందాము.

"పరలోకమందున్న మాతండ్రీ" అను పదములతో ఆ ప్రార్థనను యేసు ఆరంభించెను. ఈ మాటలలో దేవుడు సృష్టికర్తయని, ఈ లోకాన్నంతటిని పరిపాలించు గొప్ప అధికారియని మాత్రమే గాక ఆయన బిడ్డలమైన మనము ఆయన తండ్రియైయున్నాడని మనము గుర్తించవలెను. అందుకే "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" అని యేసు బోధించెను (యోహాను 3:16). దేవుడు మన తండ్రియని ఎప్పుడైతే ఒప్పుకొందుమో అప్పుడే యేసు దేవుని కుమారుని కూడ మనము ఒప్పుకొందుము.

ఎవడైనను యేసు దేవుని కుమారుడని విశ్వసించని యెడల వాడు దేవుని కుమారుడు కాడని క్రొత్తనిబంధన బోధించుచున్నది. "తన్ను ఎందరంగీకరించిరో వారి కందరికి, అనగా తన

నామమునందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెనని' యోహాను 1:12లో వ్రాయబడి యున్నది. దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు. ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదు గాని దత్త పుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మకలిగిన వారమై మనము అబ్బా, తండ్రీ అని మొర పెట్టుచున్నాము" అని రోమా 8:14,15లో అపో.పౌలు వ్రాసెను.

"నీ నామము పరిశుద్ధపరచబడునుగాక" యను మాటలు దేవుని నామము పూజింపబడ దగినదని సూచించుచున్నవి. దేవుడొక్కడే పూజింపబడదగినవాడు. కీర్తన 111:9 లో "ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింప దగినదని" వ్రాయబడి యున్నది. ఇంగ్లీషు బైబిలులో *Reverend* అను పదము ఇక్కడ ఒక్కసారే వినియోగించబడినది. అది దేవునికి వర్తించును. ఈనాడు మానవులు 'రెవరెండ్' అను బిరుదును తగిలించుకొనుట దేవుని స్థానమును ఆక్రమించుకొనుటయే. దేవుడొక్కడే పూజింపబడదగినవాడు. మానవుడు కాదు.

"నీ రాజ్యము వచ్చుగాక"యని యేసు తనమాదిరి ప్రార్థనలో నేర్పించెను. బాప్తిస్మమిచ్చు యోహాను, యేసు కూడ దేవుని రాజ్యము ఆసన్నమై యున్నదని బోధించేవారు. అప్పటికింకా దేవుని రాజ్యము స్థాపించబడలేదు. అది యింకా భవిష్యత్తులో యున్నది గనుక వారు దానిని గూర్చి ప్రార్థించవలెనని యేసు నేర్పించెను. అయితే క్రీస్తు చనిపోయి, తిరిగి లేచిన తరువాత మొదటి పెంతెకోస్తు దినమున దేవుని రాజ్యము లేక దేవుని సంఘము యెరూషలేములో మొట్టమొదట స్థాపించబడెనని అపో.కా. 2వ అధ్యాయము మనకు బోధించుచున్నది. ఆరోజు పేతురు క్రీస్తు రాజ్య సువార్తను బోధించగా ఇంచుమించు మూడువేల మంది విని, విశ్వసించి బాప్తిస్మముపొంది ఆరాజ్యములో చేర్చబడిరి. నాటినుండి నేటివరకు ఎవరైతే క్రీస్తు అధికారము ఒప్పుకొని ఆయన సువార్తకు లోబడుదురో వారి నందరిని ప్రభువు తన రాజ్యములో లేక సంఘములో చేర్చుచున్నారు.

క్రీస్తు ప్రార్థించుమని చెప్పిన రాజ్యము వచ్చేసింది. గనుక మనము దానికొరకు 'అది వచ్చునుగాక' అని యిప్పుడు ప్రార్థించినయెడల అది అర్థరహితముగా యుండును. దేవుని రాజ్యము స్థాపించబడి యిప్పుడు ఉన్నది. గనుక ఆయన రాజ్యము దినదినము

విస్తరించునట్లు మనము ప్రార్థించవలెను. సరిగదా, దానికొరకు మనము పాటు పడవలెను.

"నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక" యనునప్పుడు భూమిమీద నున్న మానవులు ఆయన ఆజ్ఞలకు లోబడునట్లు మనము ప్రార్థించుచున్నాము. దేవుని చిత్తమే దేవుని చట్టము. ముందు మనము దేవుని ఆజ్ఞలకు లోబడి, యితరులుకూడ లోబడగల్గునట్లు చూడవలెను.

"మా అనుదినాహారము నేడు మాకు దయచేయుమను" నప్పుడు మన దైనిక ఆహారముకొరకు మనము దేవునికి విజ్ఞాపనము చేయుచున్నాము. మానవుని ఆహారముకొరకు మానవుడు దేవుని ప్రకృతి సూత్రములకు లోబడి పనిచేయవలెను. మానవుడు విత్తనములు విత్తగా వాటిని ఫలింపజేయువాడు దేవుడే. అయితే ఏపనియు చేయని సోమరిని దేవుడు అద్భుత రీతిగా మాత్రము పోషింపడు. ప్రతి మానవుడు తన అనుదినాహారము కొరకు కష్టపడి పనిచేయవలసినదే.

"మా ఋణములను క్షమింపుమని" దేవుని అడుగుచున్నప్పుడు మనము ఆయన ఆజ్ఞలను మీరి పాపము చేసితిమని ఒప్పుకొనుటయేగాక ఆయన మనలను క్షమించునట్లు విజ్ఞాపన చేయుచున్నాము. మనము ఆయనయెడల నేరము చేయగా ఆయన మనలనెట్లు క్షమించునో అట్లే మనయెడల నేరముచేసిన వారిని మనము క్షమించుటకు సిద్ధముగా యుండలెనని యేసు ఈ మాదిరి ప్రార్థనలో బోధించెను.

"మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి తప్పించుము" అను మాటలలో దేవుడు మనలను శోధనల లోనికి తెచ్చునని యర్థములేదు. సరిగదా, ఆయన ఎవనిని శోధింపడు అని లేఖనములు చెప్పుచున్నవి (యాకోబు 1:13). మనలను శోధించువాడు అపవాది. "కాబట్టి దేవునికిలోబడి యుండుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్దనుండి పారి పోవును" అని యాకోబు 4:7లో వ్రాయబడి యున్నది.

మనము ప్రార్థించునప్పుడు దేవుని శక్తిపై ఆధారపడి ప్రార్థించవలెను. యేసునేర్పిన ఈమాదిరి ప్రార్థన సంక్షిప్తమైన ప్రార్థన. దానిని మనము ప్రతిచోట వల్లించుటకన్నా దానిలోని తలంపుల ననుకరించి మన ప్రార్థనలు చేయుట అవసరము. ప్రభువు నేర్పిన ఈప్రార్థన కేవలము మాదిరి ప్రార్థనయే. మీరీలాగున చేయుడి అని ఆయన

చెప్పెను. గాని మీరీప్రార్థననే చేయుడి అని చెప్పలేదు. ఆ ప్రార్థనలో ఒక అంశమగు దేవుని రాజ్యము వచ్చేసింది. గనుక అది వచ్చునట్లు మనము ప్రార్థించుటలో అర్థమేమియును లేదు. తరువాత, దేవుని రాజ్యము లేక సంఘము స్థాపించబడిన తరువాత మనము సమస్తమును క్రీస్తు పేరట చేయవలెనని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు: "మరియు మాటచేతగాని, క్రియచేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి" యని కొలస్స 3:17లో వ్రాయబడియున్నది. తండ్రియైన దేవుని సన్నిధానములో మన ప్రార్థన విజ్ఞాపనలు విన్పడవలెనన్న అవి క్రీస్తు నామమున పంపించబడవలెను. ప్రభువు నేర్పిన మాదిరి ప్రార్థన క్రీస్తు నామమున చేయబడలేదు. దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే. ఆయన క్రీస్తుయేసను నరుడు" (1తిమో 2:5). అయా కారణముల వలన క్రైస్తవులు యేసు నేర్పిన మాదిరి ప్రార్థనను ప్రార్థించనవసరము లేదు.

అయితే నీ ప్రార్థనలు దేవుని సన్నిధానమునకు తేబడవలెనన్న నీవు క్రైస్తవుడవగుట అత్యవసరము. క్రీస్తు నందు విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది క్రైస్తవుడవుకమ్ము. దేవునితో తండ్రి కుమారుల సంబంధమును ఏర్పరచుకొని క్రీస్తుద్వారా నీ విజ్ఞాపనలను ఆయనకు తెలియజేయుము. అప్పుడు ఆయన నీ మొరలను వినగలడు !!

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

# కనికరము లేని దాసుడు
## (The unmerciful Servant)
### మత్తయి 18:21-35

**పరిచయము:**

కనికరము లేని దాసుని ఉపమానమునకు అవతారికలో దిగువ సంగతులున్నవి. 1) పరలోక రాజ్యములో ముఖ్యస్థానమును గూర్చి అపొస్తలులు పోటీపడుట (మత్త 18:1). 2) వినయమును, తగ్గించుకొనుటను నేర్పుటకు ప్రభువు చిన్న బిడ్డను ఉదహరించుట (మత్త 18:2-5). 3) అభ్యంతర పరచకూడదను ప్రభువుబోధ (మత్త 18:6-14). 4) దేవుని బిడ్డల మధ్య కలుగు సమస్యల పరిష్కార విధానము (మత్త 18:15-17). అపొస్తలుల మధ్య ఐక్యత యొక్క ప్రాముఖ్యత (మత్త 18:18-20). మరియు 6) క్షమాపణను గూర్చి పేతురు ప్రశ్నించుట.

కపెర్నహూముకు వెళ్లుచు శిష్యులు వారిలో ఎవడు గొప్పవాడని వాదించుకొనుచుండిరి యని మార్కు వ్రాసాడు (మార్కు 9:33-37). ఈ సంఘటన జరిగెనని లూకా కూడ ధృవీకరించుచున్నాడు (లూకా 9:46-48). తదుపరి మరియొక సందర్భములో యాకోబు, యోహానులు తమ తల్లితో కూడ వచ్చి అపొస్తలులలో వారిని ముఖ్యులుగా గుర్తించవలెనని యేసును అభ్యర్థించిరి. తమ్మును తామే హెచ్చించుకొనవలెనని వారు చేసిన ప్రయత్నమును బట్టి యాకోబు, యోహానుల మీద మిగతా అపొస్తలులు పోటీ తత్వమును పెంచుకొని యుండిరి.

ఇట్టి పోటీ తత్వము వలన భేదములు, అసూయలు ప్రతిఫలించెను. వారికి రెండు పాఠములు బోధించుట ద్వారా యేసు ఈ దురభిమానద్వేషమును నిర్మూలించెను. 1) వనికిమాలిన అసూయకు విరుగుడుగా వినయము 2) ఒండొరుల మధ్య స్నేహభావము, సహవాసము పునరుద్ధరింపబడుటకు మారుమనస్సు, క్షమాపణలు అవసరము. అది దేవునితో వారి సహవాసమును కూడ పునరుద్ధరించును.

ఈ సంఘటన జరిగిన పిదప సంభవించిన చీలికలు సమసిపోవాలంటే, వాటిని సంతృప్తికరముగా పరిష్కరించాలి. అపొస్తలుల శిక్షణకు అది ముఖ్యము. అపొస్తలులు యేసు యొక్క గొప్ప అజ్ఞను అమలుపరచునట్లును, బాల్యదశలో నున్న సంఘమును సరిగ వారు నడిపించగల్గునట్లును, ఆయన వారిని సిద్ధపరచెను. ఇప్పుడు వారు విఫలులైతే ప్రవచనాత్మ

కముగా చెప్పబడిన దేవుని రాజ్యము ఆటంకపరచబడును. అదే రీతిగా సంఘములో అదుపులేని అసూయలు, మత్తతలు, భేదములు దాని అభివృద్ధిని ఆటంకపరచును. సజీవ ఉదాహరణగా యేసు ఒక బిడ్డను వారికి చూపించెను (మార్కు 9:36).

"ఆయన యొక చిన్నబిడ్డను తన యొద్దకు పిలిచి, వారి మధ్యను నిలబెట్టి యిట్లనెను. మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనేగాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. కాగా ఈ బిడ్డవలె తన్ను తాను తగ్గించుకొను వాడెవడో వాడే పరలోక రాజ్యములో గొప్పవాడు" (మత్తయి 18:2-4).

అభ్యంతకరమైన తప్పిదములు జరుగకుండా ప్రయత్నించినా అవి జరుగునని యేసు తదుపరి బోధించారు (మత్త 18:6-14). ఈ తప్పిదములు బహిరంగముగా గాక లోలోపల పరిష్క రించుకొనుట శ్రేష్టమని యేసు బోధిం చారు. "మరియు నీ సహోదరుడు నీయెడల తప్పిదము చేసిన యెడల నీవుపోయి నీవును అతడును ఒంటరిగా నున్నపుడు అతని గద్దించుము. అతడు నీ మాట వినిన యెడల నీ సహోదరుని సంపాదించుకొంటివి" (మత్త 18:15). ఈ తప్పిదములు ప్రైవేటుగా పరిష్కరిం పబడకపోయిన యెడల, దానిని గూర్చి సాధ్యమైనంత తక్కువ మందికి తెలియజేయవలెను. "అతడు వినని యెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతిమాట స్థిరపరచబడునట్లు నీవు ఒకరిద్దరిని వెంట బెట్టుకొని పొమ్ము" (మత్తయి 18:16). సహోదరుల మధ్య వివాదము సద్దుమణ గకపోతే వారి మధ్య సహవాసమును పునరుద్ధరించుట కొరకు స్థానిక సంఘము కల్పించు కొనవలెను. "అతడు వారిమాటయు వినని యెడల అతనిని నీకు అన్యుని గాను సుంకరిగాను ఎంచుకొనుము" (మత్త 18:17).

వారిమధ్య నెలకొల్పబడిన అసంతృప్తివలన అపొస్తలులకు ఏపని కొరకై శిక్షణనిచ్చుచున్నారో, అది ప్రమాదములోపడే అవకాశమున్నది. అపొస్తలుల అధికారమును సూచించు టకు మనం సాధారణంగా మత్తయి 18:18-20ని వినియోగిస్తాము. అపొస్తలుల మధ్య విభేధములు వారి పనికి ఆటంకములు వారి అధికారము కు కూడ అది ఒక సవాలు.

నాడున్న సంప్రదాయ బద్ధముగా పేతురు కొంతమట్టుకు ఓర్పుకలవా వానిగా యున్నా తనకు విరుద్ధముగ పాపము చేసినవానిని, ఎన్ని మారులైనా క్షమించాలనే సంగతిని ఊహించలేక

లేకపోయాడు. "ఆ సమయమున పేతురు ఆయన యొద్దకు వచ్చి -ప్రభువా నా సహోదరుడు నాయెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మారులు క్షమింపవలెను? ఏడుమారుల మట్టుకా ? అని అడిగెను" (మత్త 18:21). యిది చాల ఉదార స్వభావము. సహోదరులను మూడు మారుల మట్టుకే క్షమించాలని నాటి రబ్బీలు బోధించేవారు.

తన సహోదరుడు తన యెడల తప్పిదము చేయునని పేతురు తలంచాడు. క్షమాపణను కొలబద్ధతో కొలవాలను కొన్నాడు. అంటే దానికొక పరిమితి విధించాలని తలంచాడు. "ఇంతవరకే, అంతకు మించి కాదు!" అయితే ప్రభువు అతని తలంపులను పటాపంచలు చేసారు. ఏడుమారుల మట్టుకే కాదు, డెబ్బది ఏళ్లమారుల మట్టుకని నీతో చెప్పుచున్నాను!" అని యేసు పలికారు (18:22). ఎవనినైన నీవు అన్నిసార్లు క్షమించి యుంటే, క్షమించే అలవాటు నీవు కలిగి యుందువు. అది నీకు అలవాటై పోవును. గనుక క్షమాపణలను నీవిక లెక్కించవు, దానికి పరిమితి విధించవు.

పేతురు తనకొరకు కనికరము కోరుకొన్నాడు గాని యితరుల విషయంలోనైతే కనికరములేని న్యాయమును విధించగోరాడు. నిజానికి పేతురు క్షమింపగోరాడు. గాని పొరబాటు ఏమంటే అతడు దైవిక దృక్పథంలో గాక మానవ కోణంలో తన్నుతాను కొలవేసి కొన్నాడు.

పశ్చాత్తాపముతో కూడిన క్షమాపణను ఎన్నడు నిరాకరించరాదు. సహోదరులు కొన్నిసార్లు క్షమించినట్లు నటిస్తారు, గాని వారి క్రియల వలన క్షమించలేదని నిరూపిస్తారు. పశ్చాత్తాప పడిన వానిని క్షమించనని చెప్పేవారు అరుదుగా కన్పిస్తారు క్షమాపణకు ముందు పశ్చాత్తాపము కనబడాలి. మారుమనస్సు పొంది క్షమాపణ కోరిన వారిని క్రైస్తవుడు ఎల్లవేళలా క్షమించాలి.

"మీ విషయమై మీరే జాగ్రత్తగా ఉండుడి. నీ సహోదరుడు తప్పిదము చేసిన యెడల అతని గద్దించుము; అతడు మారుమనస్సు పొందిన యెడల అతని క్షమించుము. అతడు ,ఒక దినమున ఏడుమారులు నీ యెడల తప్పిదము చేసి ఏడుమారులు నీవైపు తిరిగి - మారు మనస్సు పొందితిననిన యెడల అతని క్షమింపవలెను" (లూకా 17:3-4). మారుమనస్సు పొందిన తోటి క్రైస్తవుని క్షమించకపోతే దేవునిలాంటి సర్వ జ్ఞానము కలిగియుండాలి !

దేవుని బిడ్డయైన వాడు క్షమించుటకు ఎల్లవేళలా సిద్ధపడి యుండాలని లేఖనములు బోధించుచున్నవి.

"కనికరముగలవారు ధన్యులు వారు కనికరింపబడుదురు" (మత్తయి 5:7). "మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయిన యెల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు" (మత్తయి 6:14-15). "మీరు తీర్చుతీర్పు చొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పు తీర్చబడును, మీరు కొలుచు కొలత చొప్పుననే మీకును కొలువబడును" (మత్తయి 7:2). "తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదు; నేరము మోపకుడి, అప్పుడు మీమీద నేరము మోపబడదు" (లూకా 6:37). "మేము మాకచ్చియున్న ప్రతివానిని క్షమించుచున్నాము గనుక మా పాపములను క్షమించుము; మమ్మును శోధనలోనికి తేకుము" (లూకా 11:4). "మీరు ఒకనియెడల ఒకడు దయగలిగి కరుణా హృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము చేసెనని యొకడనుకొనిన యెడల ఒకని నొకడు సహించుచు ఒకని నొకడు క్షమించుడి. ప్రభువు మిమ్మును క్షమించిన లాగున మీరును క్షమించుడి. (కొలస్స 3:13).

ఏడుమారులు మట్టుకు క్షమించుటకు పేతురు ఇష్టము చూపించాడు గాని, యేసు అంతకన్నా పెద్ద సంఖ్యను, 77×7 అనగా 490 సార్లు క్షమించాలని చెప్పారు (మత్త 18:22). యిది అలంకార రీతిగా చెప్పబడిన సంఖ్య, అనగా అపరిమితమైన సార్లు క్షమించుటకు మనము ఎల్లవేళలా సిద్ధపడియుండాలని ఆయన చెప్పారు.

**ఉపమానము :**

"ఆసమయమున పేతురు ఆయన యొద్దకు వచ్చి - ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మారులు అతని క్షమింపవలెను? ఏడుమారులమట్టుకా? అని అడిగెను. అందుకు యేసు అతనితో ఇట్లనెను-ఏడుమారుల మట్టుకేకాదు, డెబ్బది ఏడుమారులమట్టుకని నీతో చెప్పుచున్నాను. కావున పరలోక రాజ్యము తనదాసుల యొద్ద లెక్క చూచుకొన గోరిన యొక రాజును పోలి యున్నది. అతడు లెక్క చూచుకొన మొదలు పెట్టినప్పుడు అతనికి పదివేల తలాంతులు అచ్చియున్న ఒకడు అతని యొద్దకు తేబడెను. అప్పుతీర్చుటకు వాని యొద్ద ఏమియులేనందున వాని యజమానుడు వానిని, వాని భార్యను పిల్లలను వానికి కలిగిన యావదాస్థిని అమ్మి అప్పు తీర్చవలెనని ఆజ్ఞాపించెను.

కాబట్టి ఆ దాసుడు అతనియొద్ద సాగిలపడి మ్రొక్కి నా యెడల ఓర్చుకొనుము, నీకు అంతయు చెల్లింతునని చెప్పగా ఆ దాసుని యజమానుడు కనికరపడి వానిని విడిచిపెట్టి వాని అప్పుక్షమించెను. అయితే అయితే ఆదాసుడు బయటకువెళ్లి తనకు నూరు దేనారములు అచ్చియున్న తన తోడి దాసులలో ఒకని చూచి, వానిగొంతు పట్టుకొని -నీవు అచ్చియున్నది చెల్లింపు మనెను. అందుకు వానితోడి దాసుడు సాగిలపడి నాయెడల ఓర్చుకొనుము, నీకు చెల్లించెదనని వేడుకొనెను గాని వాడు ఒప్పుకొనక అచ్చియున్నది చెల్లించు వరకు వానిని చెరసాలలో వేయించెను. కాగా వానితోడి దాసులు జరిగినది చూచి, మిక్కిలి దుఃఖపడి వచ్చి జరిగినదంతయు తమ యజమానునికి వివరముగా తెలిపిరి. అప్పుడు వాని యజమానుడు వానిని పిలిపించి చెడ్డదాసుడా, నీవు నన్ను వేడుకొంటివి గనుక నీ అప్పంతయు క్షమించితిని; నేను నిన్ను కరుణించిన ప్రకారము నీవును నీతోడి దాసుని కరుణింపవలసియుండెను. గదా అని వానితో చెప్పెను. అందుచేతవాని యజమానుడు కోపపడి తనకు అచ్చి యున్న దంతయు చెల్లించువరకు బాధపరచువారికి వాని నప్పగించెను. మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపని యెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీ యెడల చేయుననెను" (మత్తయి 18:21-35).

దేవుడే రాజుగా మొదటి సారి ఈ ఉపమానములో చిత్రీకరించ బడెను. కనికరములేని ఆదాసుని యజమానుడు చెడ్డదాసుడా, అని పిలిచెను. దేవుని కృపా బాహుళ్యతను వర్ణించు ఏకైక ఉపమానమిది. దేవుని హృదయములో కరుణ, కృప ఎంతగా యున్నవో ఈ ఉపమానము వర్ణించు చున్నది.

యిది దేవుని రాజ్యసంబంధ ఉపమానమని 23వ వచనమును బట్టి గమనించగలము. దేవుడొకరాజుగా చిత్రీకరించబడ్డారు. లెక్క చూచు కొనుట సువార్తయొక్క పిలుపు. దాసులు పాపులకు గురుతుగా యున్నారు. సువార్త పిలుపుకు మొదట జమచేయబడినా, ఆఖరి లెక్క ఒకటి యున్నది. "గనుక మనలో ప్రతి వాడును తన్నుగురించి దేవునికి లెక్కయొప్పగింపవలెను" (రోమా 14:12). అప్పుడు కూడ క్రీస్తుయొక్క మాట చొప్పుననే లెక్క అప్పగించ వలెను. నిత్య నివాసము కేటాయించ బడకముందు ఎవడును అపరీక్షలో ఓడిపోనవసరములేదు. మొదటి పరీక్షలో ఎవడైనను ప్రవేశించ

వచ్చును. తదుపరి అవుసరమైన మార్పులు, చేర్పులు చేసికొనవచ్చును. "మీరు విశ్వాసము గలవారై యున్నారో లేదో మిమ్మును మీరే శోధించుకొని చూచుకొనుడి; మిమ్మును మీరే పరీక్షించుకొనుడి, మీరు భ్రష్టులుకాని యెడల యేసుక్రీస్తు మీలోనున్నాడని మిమ్మును మీరే ఎరుగుదురు గదా?" (2 కొరింథీ 13:5).

24వ వచనములో ఒక దాసుడు తన యజమానికి విస్తారము గా అచ్చియున్నాడు. అప్పటికి ఇప్పటికి తలాంతుయొక్క విలువను సరిగా అంచనా వేయవీలుపడదు. పదివేల తలాంతులు ఇప్పుడయితే 1,50,000/- రూ॥లుండును. అంటే ఆ దాసుడు అచ్చియున్నది లెక్కలేనంతగా యుండెను.

ఆదాసుడు తీర్చలేనంత అప్పు అది. యూదుల యొక్కయు రోమీయుల యొక్కయు చట్టప్రకారము అచ్చియున్న వాడు అమ్మివేయబడవచ్చును. ఉదాహరణకు దొంగిలించిన వాడు దాని తిరిగి ఇయ్యలేకపోతే వాడు అమ్మబడవలెను (నిర్గమ 22:3). ఒకని అప్పు అతని కుటుంబసభ్యులకును వర్తించును. దానిని తీర్చుటకు కుటుంబ సభ్యులు కూడ అమ్మబడవచ్చును (2 రాజులు 4:1).

మన పాపముల వలన దేవునికి మనము దాని అపరాధరుసుమును చెల్లించలేని స్థితిలో యున్నాము. దాసుడు వాని కుటుంబము అమ్మివేయబడుట దేవుని నుండి మనము పాపమువలన ఎడబాటు అవుదుము. ఆదాసుడు రాజుయెదుట సాగిలపడి అతని దయకొరకు విన్నవించుకొనెను. సరిగదా అంతగొప్ప ఋణమును తీర్చుటకు అతడు కొంత సమయము కొరకు బతిమాలుకొనెను. గొప్ప దుర్గతిలో యున్న మానవుడు అసాధ్యమైన సంగతులను వాగ్దానము చేయును.

ఈ దాసుడు తన విజ్ఞాపనలను బట్టి రాజును ఒప్పించగలిగెను. తత్ఫలితముగా రాజు అతని ఋణమును క్షమించెను. అతడు చేసిన హృదయారవింద విజ్ఞాపనము వలన మాత్రమే అతని ఋణము క్షమించబడెను. ఋణము తీర్చబడాలని న్యాయముకోరుచున్నది. కృప అయితే ఇక్కడ ఋణమును క్షమించెను. మనందరి యెడల పరలోకపు తండ్రి ఇట్టి కృపను చూపుచున్నారు (2 పేతురు 3:9).

ఆదాసుడు భరింపలేని ఋణము నుండి విడుదలపొందిన తరువాత అట్టి మరొక సంఘటనను 28,29 వచనములు వర్ణించుచున్నవి. ఈసారి ఆమొదటి దాసుడు తనకు కొంతసొమ్ము అచ్చియున్న మరొక దాసుని హింసించుట మనము చూడగలము. అతడు కనికర్మును

కోరుకొని దానిని పొందాడు, గాని రెండవ వాని దగ్గర కనికరము చూడకుండా న్యాయము అమలు పరచగోరాడు. మానవుడు తన పొరుగువానిని క్షమించుటను గూర్చి ఈ ఉపమానము బోధించుచున్నది.

ఈ ఉపమానములో వారు అచ్చియున్న సొమ్ము ఒకటి విస్తారమైనది, రెండవది స్వల్పమైనది. రెండవదాసుడు మొదటి వానికి వందదేనారములు అచ్చియుండెను. దేనారము రోమావారి నాణెము. దాని విలువ 20/-రూ॥లుండును. అంటే అతడు 2000/-రూ॥లు అచ్చియుండెనన్నమాట. ఆ రెండవవాడు తన జీతములో 4వ వంతు అచ్చి యుండెను. గొంతుపట్టుకొని న్యాయస్థానము దగ్గరకు ఈడ్చుకొనిపోవుట గ్రీకుల యొక్కయు, రోమియుల యొక్కయు సాంప్రదాయము. మానవులు తమ పొరుగువారి యెడల చేయుతప్పిదములు, వారు దేవునికి వ్యతిరేకముగా చేయు పాపముల యొద్ద ఎన్నతగినవి కావు. గనుక దేవుడు మనలను క్షమించిన ప్రకారము ఒకరి యెడల ఒకరు క్షమింపబద్ధులమై యున్నాము.

మొదటి దానుడు తాను యజమానికి చేసిన విజ్ఞాపనమునే రెండవవాడు తనకు చేస్తే అతని యెడల చెవిటి వానివలె ప్రవర్తించి వానిని చెరసాలలో వేయించెను. ఆ రెండవ వాడు తన ఆస్థిని అమ్మి మొదటివాని అప్పుతీర్చునను కారణముచే చెరసాలలో వేయించబడెను. అచ్చియున్న వాడు, వాని కుటుంబ సభ్యులు అప్పిచ్చిన వానికి బానిసలుగా యుండాలని అప్పుయిచ్చిన వాడు కోరుకొనును.

జరిగిన ఈ అన్యాయమును మిగతా దాసులు గమనించుటను 31వ వచనము తెలియజేయుచున్నది. క్షమాపణ లేని తత్వమును బట్టి ఇతరులు కోపించుదురు. గనుక కనికరములేని అదానుని దుష్క్రియలు రాజుకు తెలియజేయబడెను. అతని కృతఘ్నత వలన నిశ్చేష్టుడై రాజు అకనికరములేని దాసుని యెడల తన దయాళుత్వమును తారుమారు చేసెను. బాధించువారికి అతనిని అప్పగించెను. బాధించువారు నిత్యనరకము. క్షమించలేనివారిని దేవుడు శిక్షించునని ఈ ఉపమానము చెప్పుచున్నది. మొదట్లో ఈ ఉపమానము దేవుని కనికరమునకు గురుతుగా యుండెను. ఈ ఉపమానము ద్వారా దేవుని కాఠిన్యము బయలుపరచబడెను.

ముగింపు :

ఈ ఉపమానము యొక్క నీతి 35వ వచనములో విపులీకరించబడినది. "మీలో ప్రతివాడును తన సహోదరు

ని హృదయపూర్వకముగా క్షమింపని యెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీ యెడల చేయును" (మత్తయి 18:35). దేవుని నుండి క్షమాపణ నొందిన ప్రజలు తమ తోటి వారి యెడల క్షమాపణను ప్రదర్శించవలెను.

అప్పన్నది ఎంత ఎక్కువైనా అది దేవుని క్షమాపణకు ఆటంకము కాదు (యెషయా 1:18; 55:7). పాపులలో ప్రధానుని సయితము దేవుడు రక్షించును (1తిమోతి 1:15). క్షమాపణకు అతీతముగా ఎవడును లేడు. గనుక మనం క్షమించాలని దేవుడు కోరుచున్నారు.

ఈ ఉపమానమందున్న తారతమ్యములు గమనించదగినవి. మొదటిగా, పేతురు చెప్పిన సంఖ్య ప్రభువుచెప్పిన సంఖ్య. పలుమారులు క్షమించుటకు పేతురు సిద్ధపడ్డాడు గాని ప్రభువైతే లెక్కలేనన్ని మారులు క్షమించుమనెను. రెండవదిగా అచ్చి యున్న సొమ్ము ఒకటి బహుస్వల్పము. రెండవది తిరిగి ఇయ్యలేనంత విస్తారము!

- లూయిస్ రష్‌మోర్

## దైవ విశ్వాసి ప్రేమించును, ద్వేషించును
## (Believer in God Hates and Loves )

దేవుని యందు విశ్వాసము గలవాడు సున్నితస్వభావుడై సమాజము యెడల ప్రభుత్వము యెడల తన బాధ్యతలు నెరవేర్చలేడని విశ్వాసులను గూర్చి కొందరు అభ్యంతర పడుదురు. విశ్వాసికి ప్రేమ, దయ, కరుణలను అలవరచుకొనానలని బోధింపబడును గనుక అతడు ద్వేషించలేడు, కఠినముగా ప్రవర్తింపలేడని వారి భావము. ఇట్టి అభ్యంతరములను లేవనెత్తువారు ప్రేమ యొక్క తత్వమును గ్రహించుకొన్నవారు కాదు.

### క్రైస్తవుడు చెడ్డదానిని అసహ్యించు కోవాలి

దైవ విశ్వాసి భావములను అన్నీ కోల్పోవునా ? అందును బట్టి అందరి యెడల దయగా ప్రవర్తించునా? "చెడ్డదానిని అసహ్యించుకొనుడి" యని బైబిలు బోధించుచున్నది (రోమా 12:9). అసహ్యించుకొనుట యనగా హేయమైనదిగా ఎంచుట యని అర్థము, యిది చాలశక్తివంతమైన భావము. "కీడును ద్వేషించి, మేలును ప్రేమించుచు గుమ్మములలో న్యాయము ను స్థిరపరచుడి" యని ఆమోసు 5:15 చెప్పుచున్నది. తప్పుమార్గములన్నిటిని అసహ్యించుకొనాలని కీర్తన 119:104 చెప్పుచున్నది. "యెహోవా యందు భయభక్తులు కలిగి యుండుట చెడుతనము నసహ్యించుకొనుటయే" యని

సామెతలు 8:13 చెప్పుచున్నది. "ద్విమనస్కులను నేను ద్వేషించు చున్నానని" కీర్తన 119:113లో దావీదు పలికాడు. "అబద్ధము నాకసహ్యాము, అదినాకు హేయము" అని కూడ అతడు మరల పలికాడు (కీర్తన 119:163). "కోపపడుడి గాని పాపము చేయకుడి, సూర్యుడస్తమించువరకు మీకోపము నిలిచియుండరాదు" (ఎఫెసీ 4:26). గనుక అన్ని విషయములలోను మెత్తగా యుండుటకుబదులు క్రైస్తవుడు అబద్ధమును, దొంగతనమును, కల్లలాడు నాలుకను, దుష్టత్వమును అసహ్యించుకొనాలని చెప్పబడినది. క్రైస్తవులందరికి యేసు క్రీస్తేమాదిరి. అయినను ఒకప్పుడు ఆయన కొరడా ఝుళిపించి దేవాలయములో క్రయ విక్రయములను చేయువారిని త్రోలి వేసారు. "నామందిరము ప్రార్థన మందిరమనబడును, అయితే మీరు దానిని దొంగల గుహగా చేసెడివారనెను" (మత్తయి 21:13).

**క్రైస్తవుడు సుశిక్షితుడైన సైనికుడు :**

"అయెహ్య వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు మనుష్యుల యెదుట పరలోక రాజ్యమును మూయుదురు; మీరందులో ప్రవేశింపరు, ప్రవేశించువారిని ప్రవేశింప నియ్యరు" అని క్రీస్తు చెప్పెను (మత్తయి 23: 13-14). "అలాగే మీరు వెలుపల మనుష్యులకు నీతిమంతులుగా నగపడుచున్నారు గానిలోపల-వేషధారణతోను అక్రమముతోను నిండి యున్నారని" ఆయన చెప్పెను (మత్తయి 23:28).

క్రైస్తవుడు "ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుమని" హెచ్చరించబడ్డాడు (2 తిమో 3:16). దేవుని ప్రజలు, ఆయన వాక్యమును బోధించువారు అక్రమమును, అన్యాయమును, దుష్టత్వమును ఖండించాలని బైబిలు చెప్పుచున్నట్లు చదువరులు గ్రహించుకొనగలరు. ఎఫెసీ 6:13-17లో క్రైస్తవులు ఇట్లు హెచ్చరించబడ్డారు : "అందు చేతను మీరు అపద్దినమందు వారిని ఎదిరించుటకు శక్తిమంతులగుటకు దేవుడిచ్చుసర్వాంగ కవచమును ధరించుకొనుడి. ఏలాగనగా మీ నడుము నకు సత్యమను దట్టి కట్టుకొని నీతియను మైమరువుతొడుగుకొని పాదములకు సమాధాన సువార్త వలననైన సిద్ధ మనస్సును జోడుతొడుగుకొని నిలువ బడుడి. ఇవన్నియుగాక విశ్వాసమను డాలు పట్టుకొని దానితో మీరు దుష్టుని అగ్నిబాణములన్నిటిని ఆమర్చుటకు శక్తిమంతులగుదురు. మరియు రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మఖడ్గమును ధరించుకొనుడి".

గనుక క్రైస్తవుడు సుశిక్షితుడై సిద్ధపడి యున్న సైనికుడు. నీతిని జరిగించుటకు పోరాడువారిలో అతడు ప్రధముడు. సాంఘిక అన్యాయములను అక్రమములను ఎదుర్కొనుటలో అతడు ప్రధముడు. అతడు అతి విశేషమైన విప్లవకారుడు.

**క్రైస్తవుని ఆయుధములు భౌతికముకాదు:**

దైవవిశ్వాసి ఉపయోగించే ఆయుధము లేమిటి ? 2 కొరింథీ 10:3-4 ఇట్లు చెప్పుచున్నది. "మేము శరీరధారులమై నడుచుకొనుచున్నను శరీరప్రకారము యుద్ధము చేయము. మా యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావుగాని దేవుని యెదుట దుర్గములను పడద్రోయ జాలినంత బలముకలవై యున్నవి". "ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదుగాని ప్రధానులతోను ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను ఆకాశ మండలమందున్న దురాత్మల సమూహముతోను పోరాడుచున్నాము" (ఎఫెసీ 6:12). గనుక క్రైస్తవుడు యోధుడే గాని అతడు పయోగించు ఆయుధములు పరిమితి చేయబడినవి, క్రైస్తవులు తమ ఖడ్గములను నాగటి నక్కులుగాను, తమ యీటెలను మచ్చుకత్తులుగాను సాగగొట్టుదురు (యెషయా 2:4). వారు ఇహసంబంధ యుద్ధమునెరిగిన వారు కాదు. క్రీస్తు ఈలోకమునకు వచ్చినప్పుడు ఆయన మనుష్యులకు భూమిమీద సమాధానమునుగైకొని వచ్చెను (లూకా 2:14).

**క్రైస్తవుడు యోధుడు,శాంతి కాముకుడు**

క్రైస్తవుడు యోధుడు, శాంతి కాముకుడటనుట స్వయంవిరుద్ధ సంగతివలెనీకగుపడ వచ్చును. క్రైస్తవుడు అసత్యమార్గములను, దుష్టత్వాన్ని, వ్యర్థ ఆలోచనలను, అబద్ధమును అసహ్యించుకొనాలని ఇంతకుముందు గమనించాము. గాని నిన్నువలెనీపొరుగు వానిని ప్రేమించుము అని బైబిలు చెప్పుచున్నది (మత్తయి 22:39). అతడు తన శత్రువులను ప్రేమించాలి (మత్తయి 5:14). సహోదరుని ప్రేమించాలి (1 యోహాను 4:11). తనకు కీడు చేసిన వానిని ప్రేమించాలి (గలతీ 6:1). క్రైస్తవుడు శాంతి కాముకుడు గాను పోరాడు యోధునిగాను ఒకే సమయమందు ఎట్లుండగలడు ? అతడు ప్రేమించువానిగను, ద్వేషించు వానిగాను ఎట్లుండగలడు? విశ్వాసియైన వాడు భౌతిక ఆయుధముల నేమీ ఉపయోగించడు గనుక అతడు శాంతిని కోరువాడు, గాని అతడు ఆత్మీయ యుద్ధోపకరణములను ధరించుకొనువాడు గనుక అతడు యుద్ధ వీరుడు. అతడు దుష్టత్వాన్ని

ద్వేషించినను, పాపిని ప్రేమించును.

**ద్వేషముకంటె ప్రేమశక్తివంతముగా నాశనము చేయును :**

క్రీస్తునిలో యున్న ప్రేమ, దయ యనునవి ఈలోకములో యున్న శక్తివంతమైన ఆయుధములు, అన్నీ విఫలమైనా ఈఆయుధముల ద్వారా క్రీస్తువు విజయం సాధించును. పశుప్రాయమైన బలము ద్వారా, ద్వేషించుట ద్వారా మానవుడేమి చేయగలడు? అతడు భౌతిక సంగతులను నాశనము చేయగలడు, మిగతా ఆయుధములు, బిల్డింగులు, మానవ శరీరములను నాశనము చేయగలడు. గాని ప్రేమవలన మానవుల హృదయములు మార్చబడును. యువకుడొకడు ఒక యువతి హృదయమును ద్వేషము ద్వారా సంపాదించి యేమిచేయగలడు? ఏమీ చేయలేడు! గాని ప్రేమతో ఆమెహృదయమును అతడు సంపాదించుకోవచ్చును. ప్రేమ వలన ఆమె అతని కొరకుత్యాగము చేయును. మరణపర్యంతము అతనికి నమ్మకముగా నుండును. మనం మనబిడ్డలను ప్రేమింతుము వారి ప్రేమ ద్వారా మనము గొప్ప సంగతులు చేయుటకు మనకు వీలుపడును.

**ప్రేమించువాడు శక్తిమంతుడు :**

ప్రేమించువాడు దయాదాక్షిణ్యములు గలవాడు; బలవంతుడేగాని బలహీనుడుకాడు, అట్టి క్రియలద్వారా యితరుల సహాయసహకారాలను అతడు పొందును. కఠినముగా యుండి ద్వేషస్వభావము గలవాడు పొరుగువార తనికేమి చేయుదురోయని చింతించుచు యుండును. గాని ప్రేమించువాడు యితరులు తన కొరకు సహాయపడు వారలుగా వారిని పొందును.

**నెపోలియన్, క్రీస్తు ప్రేమ యొక్క ఉదాహరణలు :**

నెపోలియన్ బోనపార్టె చక్రవర్తి ఐరోపా అంతా జయించాడు. తదుపరి అతడు మాస్కో పట్టణముపై యుద్ధము చేయగా అక్కడ ఓడించబడ్డాడు. అక్కడ నుండి అతడు తరిమివేయబడ్డాడు. ద్వేషము వలన అతడు ఎల్బా ద్వీపములో బంధింపబడ్డాడు. అక్కడ చనిపోయాడు. అతడు శక్తివలన, ద్వేషము వలన జయించాలని కోరాడు గాని వాటినే పంటగా అతడు కోసాడు.

యేసుక్రీస్తు పాలస్తీన ప్రదేశములో జీవించారు. అది చిన్న ప్రాంతమే. ఆయన మేలు చేయుచు సంచరించారు. రోగులను బాగుచేసారు, గ్రుడ్డి వారికన్నులు తెరచారు, చనిపోయినవారిని లేవదీసారు, బీదలకు విశ్వాసము నిరీక్షణలనిచ్చారు. దీనులు భూమిని స్వతంత్రించుకొందురని ఆయన బోధించారు, హృదయశుద్ధిగలవారు దేవుని

చూచెదరని చెప్పారు. శత్రువులు అయనను బంధించుటకు వచ్చినప్పుడు, తన శిష్యులు కత్తులతో పోరాడుట నిషేధించారు. తన్ను వెంబండించు వారుతమ శత్రువులను ప్రేమించాలని ఆయన బోధించారు. నేడు ప్రపంచమం దంతటా కోట్లాది ప్రజలు ఆయనను వెంబడిస్తు ఆయనను ప్రేమించి ఘన పరచుచున్నారు. గాని నెపోలియన్ చక్రవర్తినైతే ప్రజలు మరచిపోయారు. క్రీస్తు యొక్కయు, నెపోలియన్ యొక్కయు కధనము ద్వేషముకంటే ప్రేమశక్తివంతమైనదని నిరూపించు చున్నది. ప్రేమించువాడు మరణించినను శక్తివంతుడే. ద్వేషించువాడు విజేయుడైనను బలహీనుడే

– ఓటిస్ గేట్వూడ్

## బైబిలును అర్థము చేసికొనుటకు పది సూత్రములు
## (Ten Simple Reasons to Understand the Bible)

**- Charles Scott**

(గత సంచిక తరువాయి)

**బైబిలులోని 66 పుస్తకములను మనం సరిగ విభజించుచు శ్రద్ధగా చదవాలి :**

3) బైబిలులో 66 పుస్తకము లున్నను అవి చిన్నవే. రోజుకు 1/2 గంట చొప్పున చదివితే క్రొత్త నిబంధనను 7 వారములలోను బైబిలు అంతటిని 7 మాసములలోను చదివేయవచ్చును. శ్రద్ధగా చదవాలంటే ఇంకా ఎక్కువ కాలము పట్టును. ప్రాధమిక సత్యములను మనం ఇట్టే గ్రహించుకోగలము. అయితే మనం జీవించునంతకాలము నేర్చుకోదగిన గొప్ప వాస్తవములు దానిలో యున్నాయి. కీర్తనల గ్రంధకర్తవలె "నేను నీ ధర్మ శాస్త్రమునందు ఆశ్యర్యమైన సంగతులనుచూచునట్లు నా కన్నులు తెరువుము" అని మనమును ప్రార్ధించగలము (కీర్త 119:18).

2 తిమోతి 2:15లో శ్రద్ధగ పఠించే అవశ్యకత చూపబడింది "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కర లేని పనివాని గాను, సత్యవాక్యమును సరిగ ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" అని అది చెప్పుచున్నది. మనకు ఇంత తెలుసునని గొప్ప చెప్పుకొనుటకు గాక, దేవుని యెదుట యోగ్యునిగా కనబడుటకు వాక్యము పఠించాలి.

ఎవడైనను గ్రంధాలయమునకు వెళ్ళి ఏదో ఒక పుస్తకము తీసికొని దాని మధ్యలో ఆరంభించడు. అయినను అనేకులు బైబిలును అట్లే చదువుతారు. ఒకడు చరిత్ర చదవాలనుకొన్నపుడు చరిత్ర గ్రంధాన్ని చదువుతాడు.

గణితమును గూర్చి చదవాలన్నపుడు ఆ గణిత గ్రంధాన్ని చదువుతాడు. మరల లెక్కలలో కూడ కఠినమైన లెక్కలకు ముందు ప్రాధమిక లెక్కలను నేర్చు కొంటాడు. బైబిలును చదివేటప్పుడు మనము కూడ అదేరకమైన తెలివిని ఉపయోగించాలి. బైబిలులోని పుస్తకాలలో చట్టము చరిత్ర, పద్యకావ్యములు, ప్రవచనములు, జీవిత చరిత్రలు మొదలగునవియున్నవి. మనము దేనిని గూర్చి తెలిసికొనగోరుచున్నామో ఆ భాగాన్ని బైబిలులో చదవాలి.

**4) దేవుడు మూడు వివిధ కాలాల్లో వివిధ మతవిధానాల నిచ్చి నందున, బైబిలును చదువునప్పుడు ఆ సంఘటన ఏ కాలము లోనిదో గమనించుము :**

**బైబిలులో రికార్డు చేయబడిన మూడు వివిధ యుగము లేమనగా :**

**1. పితరుల యుగము:** ఆదాము నుండి మోషేవరకు గల ప్రధమ యుగములో దేవుడు లిఖితపూర్వక చట్టము నియ్యలేదు. అది ఇంచుమించు 2500 సంవత్సరములుండెను. ఆయన అబ్రహాములాంటి గోత్రకర్తకు తన చిత్తమును తెలియజేయగా అతడు దానిని తన కుటుంబానికి లేక గోత్రానికే తెలియజేసేవాడు. (ఆదికా. 18:18 –19). ఆదికాండము మొదటి అధ్యాయము నుండి నిర్గమకాండము 20వ అధ్యాయము వరకు గల ప్రజలందరు పితరుల యుగములో జీవించినవారే.

**2. మోషేయుగము (లేదా) యూదుల యుగము :** తరువాత 1500 సంవత్సరముల మట్టుకు దేవుడు ప్రత్యేక ప్రజలకు ప్రత్యేక చట్టము (ధర్మశాస్త్రము) నిచ్చెను. వారు ఇశ్రాయేలీయులు, క్రీస్తు అజనాంగము నుండి ఉద్భవించు నిమిత్తము దేవుడు వారిని తన కొరకు ప్రత్యేకముగా ఏర్పచుకొనెను. క్రీస్తు వచ్చు వరకు ఇశ్రాయేలీయులకు దేవుడు పాత నిబంధననను గ్రహించెను (గలతీ 3:19; యోహా 1:17). దానిని ఆయన మోషేద్వారా అనుగ్రహించెను. అందువలన ఆకాలమును మోషే యుగమని, లేదా యూదుల యుగమని పిలువబడుట జరిగింది. మరియు ఆ ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకే తప్ప మరెవరికిని ఇయ్యబడలేదు (ద్వితీ 5:1–3, నిర్గమ 19:6 మరియు నిర్గమ 20 అధ్యా). పాతనిబంధనలోనివి యూదుల మతాచారములే గాని క్రైస్తవ్యము కాదని గుర్తించుకొనుము.

**3. క్రైస్తవ యుగము :** క్రీస్తు సిలువమీద చనిపోయినప్పటినుండి క్రైస్తవ జీవనవిధానము అమలులోనికి వచ్చినది (హెబ్రీ 9:16,17). క్రీస్తు మరల వచ్చువరకు అది కొనసాగును. నేడున్న మానవులందరికి క్రొత్తనిబంధన వర్తించును. క్రీస్తు ఈలోకమునకు

వచ్చిననాటినుండి ఏదైనా ప్రత్యేక ప్రజలకు దేవుడొక ప్రత్యేకచట్టము నీయలేదు. అందరును క్రొత్తనిబంధనను బట్టియే నడుచుకోవలెను. గనుక బైబిలును చదువునపుడు ఏ కాలములో జరిగిన సంఘటనను చదువుచున్నావో గమనించు కొనుట ముఖ్యము.

**5. పాతక్రొత్తనిబంధనల వ్యత్యా సమును గమనించుము :**

పాత నిబంధన చట్టము మనకు వర్తించకుండుటకై క్రీస్తు దానిని ఎత్తివేసి క్రొత్త నిబంధనను గ్రహించెను. పాత నిబంధనలోని నైతిక వర్తనమును మతాచారములను గమనించి అవి క్రొత్త నిబంధనకు వేరుగా యున్నవి గనుక ప్రజలు గలిబిలియగుదురు. పాత నిబంధన ప్రజలు భిన్నమైన మతపద్ధతికి లోనై జీవించిరి. కొందరు పితరుల యుగమును నక్షత్రకాంతికిని, యూదుల యుగమును చంద్రకాంతికిని, క్రైస్తవ యుగమును సూర్యకాంతికిని, పోల్చుదురు. ఈ యుగంలో దేవుని పూర్తి బయల్పాటు యొక్క వెలుగు ప్రకాశించెను.

క్రీస్తు ఈలోకమున కవతరిస్తాడని, దేవుడొక నూతన నిబంధనను అనుగ్రహిస్తాడని దేవుని ప్రవక్తలు ముందుగనే ప్రవచించిరి (యిర్మీయా 31:31-33).

క్రీస్తు మరణము తరువాత అందరు పాతనిబంధన క్రిందగాక, క్రొత్త నిబంధన క్రిందనే యుందురని హెబ్రీ పత్రిక వక్కాణించుచున్నది.

– “దేవుడు మన పితరులతో ప్రవక్తల ద్వారా మాటలాడెను, గాని ఇప్పుడు ఆయన కుమారుని ద్వారా మనతో మాటలాడెను” (హెబ్రీ 1:1).

– “అవశ్యముగా యాజక ధర్మము మార్చబడెను” (హెబ్రీ 7:12).

– “ క్రొత్త నిబంధన అని చెప్పుటచేత ఆయన మొదటిది పాతదిగా చేసి యున్నాడు” (హెబ్రీ 8:13).

– “ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తి యైయున్నాడు” (హెబ్రీ 9:15-17).

– “ఆయన క్రొత్త నిబంధనను స్థిర పరచుటకు మొదటి దానిని కొట్టి వేయుచున్నాడు” (హెబ్రీ 10:9-10).

పాతనిబంధన ఒక చట్టముగా నేటి ప్రజలకు వర్తించుటలేదని, దానిని క్రీస్తు ఎత్తివేసెనని చెప్పుటకు అనేక లేఖనములను మనం ఇంకా ఇయ్యవచ్చును. అది సిలువకు మేకులతో కొట్టివేయబడెను. (కొలస్స 2:14). మనలను క్రీస్తు నొద్దకు నడిపించుటకు పాతనిబంధన బాలశిక్షకుడాయెను. అయితే క్రీస్తు వెల్లడి ఆయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము (గలతీ 3:23-25).

**6. బైబిలును 66 పుస్తకములు గల ఒక గ్రంధాలయముగ పరిగణించుము :**

విశిష్టమైన సంగతుల కొరకు

సరియైన స్థానములో వెదకుము. బైబిలు నందు రెండు ముఖ్యభాగములున్నవి పాతనిబంధన, క్రొత్తనిబంధన, క్రీస్తు రాకముందు సంభవించిన సంగతులు - పాతనిబంధనలో గలవు. అయితే నేడు మనకు దానిలో అనేక పాఠములున్నాయి (1కొరింథీ 10:11). క్రీస్తు రాక కొన్ని వందల సంవత్సరముల ముందే చెప్పబడిన ప్రవచనాలను చదువుట ద్వారా మన విశ్వాసం బలపడ గలదు.

పాతనిబంధనలో 4 విభాగములున్నవి. వాటిలో సంగ్రహించబడిన అంశములను బట్టి అవి విభాగింపబడినవి.

**1. మోషే ధర్మశాస్త్రము : మొదటి ఐదు పుస్తకములు :**

ఆదికాండము : ఇందు మోషే సృష్టిని గూర్చి, మానవుని ఆరంభ చరిత్రను గూర్చి చెప్పుచున్నాడు. ఇందు దేవుడు అబ్రహాముకు "భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడు నని" చేసిన వాగ్దానము మనకు కనబడును (ఆది.కా. 12:1-3: 22:18). క్రీస్తే ఆ సంతానమై యున్నాడు. (గలతీ 3:16-19; మత్త 1:1). అబ్రహాము మనుమడైన యాకోబు పేరును ఇశ్రాయేలుగా దేవుడెట్లు మార్చాడో ఆదికాండము 35:10 తెలియ జేయు చున్నది.

పాత నిబంధనలోని మిగతా పుస్తకములు ఇశ్రాయేలీయులతో ఒక జనాంగముగా దేవుడెట్లు సంప్రదించాడో తెలియజేయుచున్నవి. ఆ జనాంగము నుండియే క్రీస్తు రావలసియుండెను. క్రీస్తు వచ్చిన తరువాత దేవుడు ఇశ్రాయేలీయు లకు యితరులకు మధ్య వ్యత్యాసము లేకుండ జేసెను. (అపో.కా. 15:9).

**నిర్గమకాండము :** ఐగుప్తు భానిసత్వము నుండి ఇశ్రాయేలీయులు నిష్క్రమించు టను గూర్చి నిర్గమకాండము చెప్పు చున్నది. 20వ అధ్యాయము ధర్మశాస్త్ర ము ఇచ్చుటను గూర్చి చెప్పుచున్నది. వారు దానిలోని మాదిరినను సరించి దేవుని నారాధించాలి. సేవించాలి. (నిర్గమ 34:40).

**లేవీ కాండము :** యాజకులైన లేవీయులు జరిగించవలసిన మత సంబంధ విధులను గూర్చి ఈ పుస్తకము చెప్పుచున్నది.

**సంఖ్యాకాండము :** ఇంచుమించు ఆరు లక్షల మంది యొక్క జనసంఖ్యను లెక్కించుటను గూర్చియు, 40 సంవత్స రముల మట్టుకు దేవుడు అరణ్యము గుండా వారిని నడిపించుటను గూర్చియు ఈ పుస్తకము చెప్పుచున్నది.

**ద్వితీయోపదేశ కాండము:** దేవుని ధర్మశాస్త్రము రెండోసారి వినిపించ బడుటను గూర్చియు, దానికి ప్రజలు లోబడుటను గూర్చియు ఇందు వ్రాయ బడియున్నది. దేవుడు ఇశ్రాయేలీయు లను కానానుకు నడిపించుచున్నాడు. వారక్కడ స్థిరపడిన తరువాత ఆయన ధర్మశాస్త్రమును వారు మరచిపోకూడదని ఆయన అభిమత మైయుండెను. వారు దానికిలోబడాలని. దాన్ని తమ పిల్లలకు ఉపదేశించాలనీ ఆయన కోరెను. (సశేషము)

పగటివేళస్థానికసంఘం ఆవరణములోను, రాత్రివేళ నూజివీడు సమతానగర్‌లో బహిరంగ కూటములలోను క్రీస్తు శరీరమును గూర్చిన సత్యమును సోదరులు సవిస్తరముగా బోధించిరి. జాషువాగూటం. వి సుదర్శనరావు (రాజమండ్రి) డి.రత్నకిషోర్ (విజయవాడ) కె. శతానంద కుమార్, ఓర్సు ఆదాము, కె.జి. కుమార్ (కాకినాడ), ఓ. ప్రభుదాసు (మైలవరం), ఇందుపల్లి ఇశ్రాయేలు (తిరువూరు) మొదలగువారు వాక్యోపదేశముగావించిరి. స్థానికసంఘము అన్ని ఖర్చులు భరించి, భోజనపానాదుల విషయంలో సహకరించిరి. సోదరులు కె. ఇశ్రాయేలు (కంభంపాడు), బి.యేసుబాబు (వెల్వడం), ఓర్సు ప్రభుదాసు (మైలవరం), ఆర్. ప్రసన్న కుమార్ (ఆర్.ఆర్.పేట), ఓ. నాగేశ్వరరావు (రెడ్డిగూడెం), కె.రాజ్ కుమార్ (విజయవాడ) గార్లు ఆయాకూటములకు అధ్యక్షత వహించి సమర్ధవంతముగా నడిపించిరి. ఓర్సు ప్రసాదరావు గారి ప్రార్ధనలతో సభలు ప్రారంభించబడెను. నూజివీడులోను, పరిసరప్రాంతములలోను సోదరులు ఓర్సు ఆదాముగారు క్రీస్తు కొరకు చేయుచున్న నిర్విరామ కృషి కొరకు దేవునికి వందనములు.

2014 మార్చి 28 నుండి 31 వరకు ఒరిస్సా రాష్ట్రములో బరంపురం పట్టణములోను పరిసరప్రాంతములలోను జరుగబోవు బైబిలు క్లాసులకు, సువార్త కూటములకు హాజరవుటకు జాషువా గూటం దంపతులు, వెళ్లుటకు ఈ పత్రిక ముద్రించు సరికి సిద్ధపడుచున్నారు. గావున ప్రార్ధించమనవి.

2014 ఏప్రియల్ మొదటివారమునుండి ఆరాధన ఛానల్‌లో ప్రతిశనివారము ప్రసారమయ్యే సత్యవాణి టి.వి.కార్యక్రమము నిధులలేమి వలన నిలిపివేయడమైనది. ప్రేక్షకులు గమనించమనవి.

## మీకొక గొప్పసదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 20 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును గాని మీరు 120/- రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరినీ స్థాపించండి.

# SATYA VANI


# 7-9-35, Sambamurthy Street,

Kakinada - 533 004. Ph: 0884- 2363722



RNI Regd. No. 69973/98

Postal Regd. No. AP-VM/KD/02/2012-2014


To


From:

SATYA VAKKU

P.O. Box 80, Kakinada - 533 001



Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004